ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

• బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ • ఘనంగా మొహర్రం వేడుకలు



పీరీలకు మొక్కులు చెల్లించుకుంటున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

'నమస్తే' నెట్‌వర్క్, జూలై 18 :

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా పీరీల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పీరీలను ఊరేగించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బోథ్ నియోజకవర్గంలోని ప్రజలంతా ఐక్యమత్యంగా ఉంటేనే నియోజకాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం తాంసిలో హసేన్ హుస్సేన్ దేవస్థానాలను దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని పీరీలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, మాజీ వైస్ ఎంపీపీ ముచ్చరఘు, మాజీ సర్పంచ్ అశోక్, గోవర్ధన్ రెడ్డి, నాగిరెడ్డి, యువ నాయకులు అభిరాంరెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రీతం రెడ్డి, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ కాని వారు అధికారులను సంప్రదించాలి

• ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

తాంసి : బండల్‌నాగపూర్‌లోని రైతు వేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

తాంసి, జూలై 18 : జిల్లాలోని అర్హులైన రైతులకు రుణమాఫీ కాకుంటే సంబంధిత క్లస్టర్ అధికారులను సంప్రదించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండలంలోని బండల్ నాగపూర్ రైతు వేదికలో నిర్వహించిన సీఎం రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు. మూడు విడతల్లో రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. మొదటగా రూ.లక్ష, రెండో విడుత రూ.లక్షా యాభై వేలు, మూడో విడుత రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు వస్తే మండల క్లస్టర్లకు సంబంధించిన ఏఈవోలకు మండల ఏవోలకు తెలియజేయాలని, వారు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ఈ సమస్యలు నెల రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. మత్తడి వాగు, ఆయకట్టు పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లాకు ముఖ్యమంత్రి రానున్నారని, డబ్బులు వృథా చేయకుండా వ్యవసాయం, విద్య కోసం ఖర్చు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, మాజీ ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి రవీందర్, సీఈవో కేశవ్, నాయకులు గడుగు గంగన్న, నారాయణ, సంతోష్, ధనుంజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో 18,739 మందికి రుణమాఫీ

ఎదులాపురం, జూలై 18: జిల్లాలో రైతు రుణమాఫీ రూ.లక్షలోపు పంట రుణాలు పొందిన 18,739 మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు మాఫీ చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో గూగుల్ మీట్ ద్వారా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీకి సంబంధించి గైడ్‌లైన్స్ ప్రకారం జమ అయ్యే రుణం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నేరుగా రైతులకు చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం తదితర డాక్యుమెంట్స్ తీసుకొని రెన్యువల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందన్నారు. 13 డిసెంబర్ 2023 నుంచి 9 డిసెంబర్ 2023 మధ్య కాలంలో తీసుకున్న రైతులకు వర్తిస్తుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రైతులకు సంబంధించిన వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు ఉన్నారు.

హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి

సోన్, జూలై 18: రైతులకు రుణమాఫీ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా, మండల స్థాయిలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి పక్రియను సజావుగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. గురువారం నిర్మల్ మండలంలోని న్యూపోచంపాడ్ గ్రామంలో ఎల్లపెల్లి క్లస్టర్ రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ పక్రియను మూడు దశల్లో పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. మొదటి దశలో రూ. లక్షలోపు, రెండో దశలో లక్షన్నర, మూడోదశలో రూ. 2లక్షలను రుణమాఫీ పక్రియను సజావుగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతులు సంబంధిత బ్యాంకుల్లో ఇబ్బందులు పడకుండా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, జిల్లా లీడ్ మేనేజర్ రాంగోపాల్, తహసీల్దార్ సంతోష్, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఏవో, ఏఈవోలు, రైతు సంఘాల నాయకులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

నిర్మల్ అర్బన్, జూలై18 : రైతులకు ఇబ్బందులు లేకుండా బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంలో పని చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. రైతు రుణమాఫీ 2024కు సంబంధించి జిల్లాలోని వివిధ బ్యాంకు శాఖల మేనేజర్‌లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలుకు శ్రీకారం చుట్టిందని ఇందులో భాగంగా మొదటి దశలో రూ.1లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. రుణ మాఫీకి సంబంధించి నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడంతో ఎటువంటి సమస్యలు లేకుండా అధికారులు పని చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 30,106 మంది రైతులకు రూ.171.76 కోట్లు మొదటి దశ రుణమాఫీ కింద జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, రామ్ గోపాల్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

డీఎస్సీ పరీక్ష ప్రారంభం

ఎదులాపురం, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. గురువారం నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు జరగనుండగా.. తొలిరోజైన గురువారం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నలంద కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో అభ్యర్థులు సమయాని కంటే ముందుగానే చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా అధికారులు తనిఖీ చేసిన అనంతరం పరీక్షా కేంద్రంలోకి పంపించారు. హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డులను పరిశీలించారు. అదేవిధంగా పోలీసులు అభ్యర్థులకు అల్ ది బెస్ట్ చెబుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. పరీక్షా సమయం కంటే 15 నిమిషాల ముందే గేట్లను మూసివేసి ఎవరిని కూడా అనుమతించలేదు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 100 మంది అభ్యర్థులకు 86 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటలకు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 100 మందిలో 86 మంది పరీక్ష రాశారు. కాగా.. ఉదయం ఎస్ఏ ఫిజిక్స్, మధ్యాహ్నం పీఈటీలకు పరీక్ష నిర్వహించారు. ఈ విషయాన్ని పరీక్షల పర్యవేక్షకులు పున్నారావు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని రూరల్ సీఐ ఫణిదర్, మావల ఎస్ఐ వంగ విష్ణువర్ధన్‌లు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో మహిళ హంగామా

మహిళ‌ను బస్సులో నుంచి కిందికి దింపుతున్న సిబ్బంది

ఎదులాపురం, జూలై 18 : మద్యం మత్తులో మహిళ ప్రయాణికురాలు ఆదిలాబాద్ ఆర్టీసీ బస్సులో హంగామా సృష్టించింది. గురువారం ఉదయం 11.30 గంటలకు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బస్టాండ్ నుంచి నిర్మల్ జిల్లాకు బయలుదేరింది. మద్యం మత్తులో ఉన్న మహిళ ఈ బస్సు ఎక్కి ప్రయాణికులందరిని ఇబ్బందులకు గురిచేసింది. ఆ మహిళను బస్సు దిగమని కండక్టర్ సూచించినప్పటికీ దిగనని మొండికేసింది. దీంతో కండక్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ చౌరస్తా వద్ద బస్సును ఆపారు. వన్‌టౌన్‌కు చెందిన మహిళా పోలీసులు మద్యం మత్తులో ఉన్న మహిళను బలవంతంగా బస్సులో నుంచి కిందికి దింపారు. ఆమె నుంచి ఒక క్వార్టర్ మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు.

బురదలో కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..

బురదలో నడుస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ, జూలై 18 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీలో గల రాజులగూడ గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు పడడంతో రోడ్డు బురదమయంగా మారింది. వాహనాలు వెళ్లడానికి వీలు లేదు. దీంతో వైద్య సిబ్బంది దాదాపు రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 12 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక, ఎంఎల్‌హెచ్‌పీ సంగీత, ఆశా కార్యకర్త గంగామణి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యానికి స్ఫూర్తి అన్నాభావు సాటే

భైంసా, జూలై, 18: సామాజిక సంఘ సంస్కర్త, ప్రముఖ కవి అన్నభావు సాటే సాహిత్య ప్రజా చైతన్యానికి స్ఫూర్తి అని, అలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుచుకోవాలని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బౌద్ధాచార్యులు హెమ్మే ప్రసంజీత్ అన్నారు. భైంసాలోని ఏపీనగర్ బుద్ధవిహార్‌లో గురువారం బీఎస్ఐ ఆధ్వర్యంలో లోక్ షాహీర్ అన్నభావు సాటే 55 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశాల్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

నార్నూర్, జూలై18 : అన్నాభావు సాటే ఆశయ సాధన కోసం కృషి చేయాలని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో అన్నాభావు సాఠే 55వ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నాభావుసాఠే అసోసియేషన్ మండలాధ్యక్షుడు కోరేల మహేందర్, దళిత అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, నాయకులు జ్ఞానోబాపుష్కర్, లోఖండే దేవ్‌రావ్, దస్తగిరి, గైక్వాడ్ దిగంబర్, రాజు తదితరులున్నారు.

తానూర్, జూలై, 18 :మండలంలోని హిప్నెల్లిలో గురువారం డాక్టర్ సాహిత్యరత్న లోక్ షహీర్ అన్నభావుసాటే 55 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నభావు సాటే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఆర్పీస్ మండల అధ్యక్షుడు సురేశ్‌వాడ్ సాహేబ్‌రావు, కార్యకర్తలు ఉమాకాంత్, చందూ, గంగాధర్, సంగంనాథ్, చంద్రకాంత్, గంగాప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్, జూలై 18 : గుడిహత్నూర్ మండల కేంద్రంలో గురువారం సాహిత్య-సామ్రాట్ అన్నాభావు సాటే వర్ధంతిని సాటే సంఘం మండల అధ్యక్షుడు బాలాజీ అధ్యర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ హాజరై చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంకుష్ వాగ్మారే, గాయ్‌కాంబ్లె కుశాల్, సిద్ధార్థ్,మత పతి గజానంద్, జాదవ్ రమేశ్, అంగద్, సుదర్శన్,తదితరులు న్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల సవరణ కోసం కేంద్రం ఏర్పాటు

ఎదులాపురం, జూలై18: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాని దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవా కేంద్ర ద్వారా డేటా సవరణ (కరెక్షన్)చేసుకోవచ్చని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం సీపీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. గృహజ్యోతి, మహాలక్ష్మి ద్వారా అమలవుతున్న రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా స్కీం కోసం దరఖాస్తు చేసుకున్న వారు డేటా సవరణ కోసం ప్రజాపాలన సేవ కేంద్రాలకు వెళ్లి డేటా సవరణ చేసుకొని లబ్ధిపొందాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. డేటా సవరణ కోసం వేళ్తే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్ కార్డు, ఆధార్, విద్యుత్ కనెక్షన్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్ , ఎల్పీజీ కస్టమర్ఐడీ, మొబైల్ నంబర్ తీసుకువెళ్లాని ఆయన సూచించారు.



గురువారం బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

డిసెంబర్‌కల్లా మలబార్ ప్లాంట్ రెడీ

• మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ప్రముఖ బంగారం, వజ్రాభరణాల తయారీ సంస్థ మలబార్ జ్యుయెల్లరీ తెలంగాణ ప్లాంట్.. ఈ ఏడాది చివరికల్లా ఉత్పత్తిలోకి రానున్నది. రూ.750 కోట్ల పెట్టుబడితో మహేశ్వరంలో ఈ నగల తయారీ కేంద్రాన్ని మలబార్ ఏర్పాటు చేస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మహేశ్వరంలో ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన భూమిని అప్పుడే కేటాయించారు. మొదటి దశలో ఇప్పటికే కంపెనీ రూ.183 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఈ క్రమంలోనే గురువారం మలబార్ వర్గాలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సచివాలయంలో సమావేశమయ్యారు. ప్లాంట్ నిర్మాణం తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మలబార్ సంస్థ మహేశ్వరంలో తెస్తున్న యూనిట్ దేశంలోనే అతిపెద్దదని చెప్పారు. డిసెంబర్‌కల్లా సిద్ధమవుతుందన్నారు. అలాగే కావాల్సిన మౌలిక సదుపాయాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏఐపై 20 ఏండ్ల రోడ్‌మ్యాప్..

ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై వచ్చే 20 ఏండ్లకు అవసరమైన ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని మంత్రి శ్రీధర్ బాబు బ్రిటిష్ హై కమిషన్, ఏర్టెస్ట్ అండ్ యంగ్(ఈ అండ్ వై) కంపెనీ ప్రతినిధులకు సూచించారు. తెలంగాణా ప్రభుత్వం 200 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీలో బ్రిటిష్ హై కమిషన్, ఈ అండ్ వై సంస్థలు కీలక భాగస్వాములు కావాలని ఆయన కోరారు. మరోవైపు సెబీ రూపొందించిన సోషల్ స్టాక్ ఎక్స్చేంజ్ విధానం ద్వారా సంక్షేమ పథకాలకు అవసరమైన నిధులను సేకరించనున్నట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. నిధుల సమీకరణకు ప్రణాళికపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఐటీ ఉద్యోగులకు నిరాశే

జీతాల పెరుగుదల అంతంతే • టాప్ కంపెనీల్లో వృద్ధి శాతం సింగిల్ డిజిటే

బెంగళూరు, జూలై 18: సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గత ఆర్థిక సంవత్సరం (2023-24) నిరాశనే మిగిల్చింది. అంతకుముందు రెండు ఆర్థిక సంవత్సరాలు సిబ్బంది జీతాలను రెండంకెల స్థాయి వృద్ధిలో పెంచిన ప్రధాన ఐటీ రంగ సంస్థలు.. గత ఆర్థిక సంవత్సరం మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితం చేశాయి మరి. దేశంలోని టాప్-5 ఐటీ కంపెనీల్లో మూడింట్లో వ్యయ నియంత్రణ చర్యలు స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆర్థికపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయా సంస్థలకు ఖర్చుల కట్టడి తప్పట్లేదు. ఇందులో భాగంగానే ఉద్యోగులకు వార్షిక వేతనాల పెంపులో కోత పెడుతున్నాయి. దీంతో మెజారిటీ ఐటీ ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 5 శాతం నుంచి 9 శాతం మేరకే సాలరీల్లో ఇంక్రిమెంట్లు దక్కాయి.

సగటున జీతాల పెంపు %	TCS*	Infosys*	HCL*	Wipro**	TechM*
FY24	7-9	9	NA	9.4	5.6
FY23	6-9	9.9	5.1	13.4	6
FY22	10.5	14.6	6.8	10.4	5.2
FY21	6.4	6	4	10	0.3

దిగ్గజ సంస్థల్లో..

దేశీయ ఐటీ రంగ సంస్థల్లో రెండో అతిపెద్ద సంస్థ అయిన ఇన్ఫోసిస్‌లో గత ఆర్థిక సంవత్సరం ఉద్యోగుల జీతాలు సగటున 9 శాతమే పెరిగాయి. ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్‌లోనైతే 7-9 శాతమే. విప్రో విషయానికొస్తే.. 2023-24లో 9.4 శాతంగా ఉంటే.. టెక్ మహీంద్రాలో 5.6 శాతమే. కాగా, కరోనా ప్రభావం ఉన్నప్పటికీ 2021-22లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు తమ ఉద్యోగుల జీతాలకు రెండంకెల స్థాయిలో పెంపు శాతాన్నిచ్చాయి. టెక్ మహీంద్రా 5.2 శాతం, హెచ్‌సీఎల్ 6.8 శాతంతోనే సరిపెట్టాయి.

ప్రతికూలతల వల్లే..

భారీ సంఖ్యలో ఉద్యోగులు, పెరుగుతున్న వ్యాపార ఖర్చులు.. భారతీయ ఐటీ రంగాన్ని దెబ్బతీస్తున్నట్టు రిక్రూట్‌మెంట్ కన్సల్టెన్సీ మిషెల్ పేజ్ ప్రతినిధి ప్రన్షు ఉపాధ్యాయ్ అన్నారు. సంస్థాగత ఆదాయం-లాభాలు తగ్గడంతో దానికి తగ్గట్టుగానే పొదుపు మంత్రం జపిస్తున్నాయన్నారు. ఇక ప్రవేశ స్థాయిలో ప్రతిభ, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల లభ్యత లేకపోవడం కూడా సమస్యగా మారిందని చెప్పారు. కాగా, సంక్లిష్టమైన సాంకేతిక నైపుణ్యాలను కలిగిన ఉద్యోగులకు 12 నుంచి 15 శాతం సగటున సాలరీలు పెరుగుతున్నట్టు రాండ్‌స్టడ్ డిజిటల్ ఇండియా ఎండీ మిలింద్ షా తెలిపారు. ఆయా సంస్థలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తుండటంతో ప్రతిభావంతులకు సహజంగానే పెద్దపీట దక్కుతున్నదని తెలియజేశారు. వారి అవసరాలు బాగా ఉండటంతోనే జీతాలు అంతలా పెరుగుతున్నాయని గుర్తుచేస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ఏఐ, ఎంఎల్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులకు గిరాకీ ఎక్కువగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.

మున్ముందూ తిప్పలే

దేశ, విదేశాల్లో నెలకొన్న ఆర్థిక మందగమనం ఛాయలు.. భారతీయ ఐటీ కంపెనీలకు మున్ముందు మరిన్ని ఇబ్బందులను సృష్టించగలవన్న అభిప్రాయాలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక సంక్షోభపు పరిస్థితులు.. దేశీయ ఐటీ కంపెనీల ఆదాయానికి ఇప్పటికే గండి కొడుతున్నాయని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే భారీగా ఉద్యోగ కోతలు, అంతంతమాత్రంగా జీతాల పెంపులని ఐటీ రంగ నిపుణులు ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నారు. అగ్ర దేశాల రక్షణాత్మక ధోరణులు, వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు కూడా ఆర్థిక వ్యవస్థల్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు మారకపోతే ఐటీయేగాక అన్ని రంగాల మనుగడకు ముప్పేనని హెచ్చరిస్తుండటం గమనార్హం.

వాణిజ్య

రూపాయే..

ముంబై, జూలై 18: దేశీయ కరెన్సీ రికార్డు స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు 5 పైసలు కరిగిపోయి 83.63 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్‌కు అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 83.57 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడేలో 83.55 గరిష్ఠ స్థాయిని తాకింది. ఒక దశలో 83.66 చారిత్రక కనిష్ఠ స్థాయిని తాకిన విలువ చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే ఐదు పైసలు తరిగిపోయి 83.57 వద్ద స్థిరపడింది.

అరబిందో 750 కోట్ల బైబ్యాక్!

హైదరాబాద్, జూలై 18: ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో ఫార్మారూ.750 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నది. ఇందుకుగాను కంపెనీ బోర్డు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. షేరుకు రూ.1,460 చొప్పున 51,36,986 షేర్లను బైబ్యాక్ చేయనుండటంతో 0.88 శాతం వాటా పెరగనున్నది. ప్రస్తుతం సంస్థలో ప్రమోటర్లకు 51.8 శాతం వాటా ఉండగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు 16.73 శాతం, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు 19.17 శాతం వాటా ఉన్నది.

81 వేల పైకి సెన్సెక్స్

మరో మైలురాయిని అధిగమించిన సూచీ

ముంబై, జూలై 18: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో మైలురాయిని అధిగమించాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సూచీలు గురువారం మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 81 వేల మైలురాయిని అధిగమించింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ చరిత్రలో ఈ రికార్డును అధిగమించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 626.91 పాయింట్లు అందుకొని 81,343.46 పాయింట్ల వద్ద స్థిరమైంది. బలహీనంగా ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో రివ్వున ఎగిశాయి. ఐటీ రంగ సంస్థలు అంచనాలకుమించి రాణిస్తుండటంతో మదుపరులు ఈ షేర్లను కొనుగోలు చేయడానికి ఎగబడటంతో ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివర్లో ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ ఒక దశలో 220 పాయింట్లకు పైగా బలపడ్డ సూచీ చివర్లో 187.85 పాయింట్లు అందుకొని 24,800.85 వద్ద స్థిరపడింది.

- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 3.33 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇన్ఫోసిస్ 1.93 శాతంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ, టెలికం, ఆటో, టెక్ రంగ షేర్లు లాభపడగా..క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రీయల్స్, యుటిలిటీ రంగ షేర్లు నష్టపోయాయి.

- గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,446 పాయింట్లు(1.79 శాతం), నిఫ్టీ 485 పాయింట్లు(1.98 శాతం) బలపడ్డాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్